క్లుప్తంగా

కళాకారుడు శివరామప్రసాద్‌కు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో గురువారం శ్రీకృష్ణతులాభారము చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. శుక్రవారం విశ్వరూపం చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక, సాంఘిక నాట కళాకారుడు భోగాది శివ రామప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆవులు చక్రవర్తి, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, గాజుల శ్రీనివాసరావు, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్ పాల్గొన్నారు.

ఇటుక బట్టీలలో రక్షణ చర్యలు చేపట్టాలి



కొల్లూరు: ఇటుక పరిశ్రమతో పాటు, వివిధ ప్రాంతాలలో పనిచేసే కూలీలు వడగాలుల బారిన పడకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాల్సిన బాధ్యత యాజమాన్యాలపైనే ఉంటుందని రేపల్లె సహాయ కార్మిక అధికారిణి వి.సాయిజ్యోతి అన్నారు. గురువారం మండలంలోని పలు ఇటుక బట్టీలను పరిశీలించిన ఆమె బట్టీల్లోని వలస కార్మికులకు ఇటుక ఉత్పత్తిదారులు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూలీల పని వేళల్లో మార్పులు చేసి ఎండ తీవ్రత, వడగాలులు తక్కువగా ఉన్న సమయంలో మాత్రమే పనులు చేయించాలని సూచించారు. కూలీలు వడదెబ్బ బారిన పడితే వారికి తక్షణమే వైద్య సేవలు అందించడానికి అవసరమైన ఏర్పాట్లు ఉండటంతోపాటు, వారికి తరచుగా చల్లటి నీరు అందుబాటులో ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. ఈసందర్భంగా ఆమె కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

కేఎల్‌యూలో బాల స్వేచ్ఛ వేసవి శిక్షణా శిబిరం



తాడేపల్లిరూరల్: నగర పాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయం స్వేచ్ఛా టీమ్ ఆధ్వర్యంలో కంప్యూటర్‌పైన సుమారు 400 మంది 8,9 తరగతులు చదువున్న విద్యార్థులకు 10 రోజులపాటు ఇచ్చిన ఉచిత శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కేఎల్‌యూ స్వేచ్ఛా కమిటీ అధ్యాపకులు శ్రీపతిరాయ్ గురువారం తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 7,8 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఉచిత కంప్యూటర్ శిక్షణా శిబిరంలో కంప్యూటర్‌లో మెళకువలు నేర్పుతున్నామని, కంప్యూటర్ పట్ల అవగాహన పెంచుకుంటే పైతరగతులకు వెళ్లిన సమయంలో ఈ పరిజ్ఞానం ఉపయోగపడుతుందని అన్నారు. తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల ప్రాంతాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా ఈ ఉచిత శిక్షణా శిబిరానికి హాజరయ్యారని అన్నారు. కంప్యూటర్ శిక్షణతోపాటు సామాజిక అంశాలైన నాటికలు, ఇంద్రజాలం, ఇంటివద్దనే చేయగల సైన్స్ ప్రయోగాల పట్ల ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పదిరోజులపాటు శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు భోజనం, టిఫిన్‌లను కేఎల్ విశ్వవిద్యాలయం చైర్మన్ కోనేరు సత్యనారాయణ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.వి.ఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

గుంటూరు ఈస్ట్: వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శశాంక్ గోయల్ కాలనీలో నివసించే పుల్లమ్మ (72) పక్షవాతంతో బాధపడుతోంది. రెండు రోజుల కిందట కుర్చీలో నుంచి కిందపడి గాయపడింది. కుమారుడు వెంకటేశ్వర్లు జీజీహెచ్‌కు తరలించాడు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వ్యక్తి ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.సంజీవయ్యనగర్‌లో నివసించే రమేష్ (51) మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. మానసికంగా కుంగిపోయి బుధవారం రాత్రి తన గదిలో రాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు ప్రసాద్‌బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనోవ్యాధులకు మందు ఉంది !

- అధికంగా స్మార్ట్‌ఫోన్స్, కంప్యూటర్ వినియోగంతో చిక్కులు
- ఏటా పెరుగుతున్న మానసిక సమస్యలు
- మే మానసిక ఆరోగ్య అవగాహన నెల



మానసిక ఆరోగ్య అవగాహన నెల పోస్టర్‌లు

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందిన వారి వివరాలు

2020	16,529 మంది
2021	22,726 మంది
2022	29,579 మంది
2023 జనవరి నుంచి ఏప్రిల్ వరకు	10,222 మంది

గుంటూరు మెడికల్: ఇంట్లో పిల్లలు అదే పనిగా వీడియో గేమ్స్ ఆడుతూ మిగతా పనుల్ని పక్కన పెట్టేస్తున్నారా..తదేకంగా గంటల తరబడి టీవీలకు అతుక్కుపోయి ఉంటున్నారా? అయితే వారిని ఓ కంట కనిపెట్టి ఉండాల్సిందే ! లేనిపక్షంలో చిన్న వయస్సులోనే మానసిక వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గంటల కొద్దీ కంప్యూటర్ ముందు కూర్చుని చాటింగ్‌లు చేయడం, ఫేస్‌బుక్‌లో తలమునకలు అవ్వడం వల్ల మానసిక సమస్యలకు గురవుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. సెల్‌ఫోన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్ వినియోగం బాగా పెరిగాకా నేడు నూతనంగా వస్తున్న మానసిక జబ్బుల్ని ఈ-ఎడిక్షన్‌గా వైద్యులు పేర్కొంటున్నారు. మానసిక వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచి, వాటి బారిన పడకుండా ఏటా మే నెలను ప్రపంచ మానసిక ఆరోగ్య అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

వైద్యుల ఆందోళన

మానసిక వ్యాధులతో 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారు ఎక్కువగా నేడు వైద్యుల్ని సంప్రదిస్తున్నారు. గుంటూరు నగరంలో 18 మంది మానసికవ్యాధి వైద్యనిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు రోజూ 20 నుంచి 30 మంది వివిధ రకాల మానసిక వ్యాధులతో చికిత్స కోసం రావడం గమనార్హం. గుంటూరు జీజీహెచ్‌లో అయితే రోజూ 100 నుంచి 130 మంది వివిధ రకాల మానసిక సమస్యలతో చికిత్స పొందుతున్నారు. ప్రతి ఏడాది మానసిక రోగుల సంఖ్య పెరిగిపోవడంపై వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల్లో సైతం మానసిక సమస్యలు రావడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు.

మానసిక వ్యాధి లక్షణాలు

- వారానికి పైబడి చికాకు, కోపం, విసుగు
- తనలోతాను మాట్లాడుకోవడం,
- ఒంటరిగా తనొక్కడే ఉండి నవ్వుకోవడం
- వ్యక్తిగత శ్రద్ధ తీసుకోకపోవడం
- చేసిన పనిని పదేపదే చేయాలనుకోవడం
- అనవసరమైన ఆలోచల్ని ఆపుకోలేకపోవడం
- నిద్రలేమి, బరువు పెరగడం
- నిర్ణయాలు తీసుకోవడంలో తీవ్ర జాప్యం
- తనమీద ఆధారపడే వారందరిని ఇబ్బందికి గురిచేస్తూ తాను కూడా గురవ్వడం
- ఎక్కువ సమయం పనిమీద ఏకాగ్రత లేకుండా కాలక్షేపం చేసే ధోరణిలో ఉండటం
- తనకు హాని చేస్తున్నట్లు ఊహించుకుని తగాదాలు వరకు వెళ్లడం, తిరగబడి దాడి చేయడం
- అనుమానాల్ని నివృత్తి చేసే ప్రయత్నం చేసినా ఒప్పుకోకపోవడం

రావటానికి కారణాలు

ఒత్తిడి, చెడు అలవాట్లు, పరిమితి లేకుండా సెల్‌ఫోన్ వినియోగం వల్ల నేడు మానసిక సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. వంశపారంపర్యం లేదా మెదడులో రసాయనాలు ఊరడంలో మార్పు, గడ్డలు ఏర్పడం వల్ల వస్తాయి. మెదడులో 'డోపమిన్' హార్మోన్ లోపం వల్ల, సమతుల్యం లోపించడం వల్ల కూడా వస్తాయి.అసమానత్వం, పుట్టుకతో మెదడు సరిగ్గా ఎదగకపోవడం కారణం కావచ్చు. ఫిట్స్, మందు, పొగ తాగడం వల్ల కూడా వస్తాయి. ఉద్యోగం, చేసే పని, చదువులో ఒత్తిడి పెరగటం వల్ల ,ఆలుమగలు మధ్య సఖ్యత లోపించి తరచుగా వివాదాలు జరుగుతూ ఉండటం, నిద్రలేమి, తీవ్రమైనవత్తిడి, వ్యక్తిగతంగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరకనప్పుడు మానసిక వ్యాధులొస్తాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి



మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. ఆందోళనకు గురిచేసే విషయాల్ని పట్టించుకోకూడదు. మద్యం, పొగతాగడం లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి. ఆరు నుంచి తొమ్మిది గంటల పాటు నిద్రపోవాలి. కుటుంబ సభ్యులందరితో కలసి కొంత సమయాన్ని గడపాలి. ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. గత పదేళ్లలో అనేక ఆధునిక మందులు వ్యాధిగ్రస్తులకు అందుబాటులోకి వచ్చాయి. మొదటి దశలోనే గుర్తిస్తే త్వరితగతిన నయం చేసేందుకు అవకాశం ఉంది.

– డాక్టర్ వద్దాది వెంకటకిరణ్, అసోసియేట్‌ప్రొఫెసర్, గుంటూరు జీజీహెచ్

జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవలు



మానసిక వ్యాధులకు జీజీహెచ్‌లో ఉచిత వైద్య సేవల్ని అందించడంతో పాటు మందులు కూడా ఉచితంగానే అందజేస్తున్నాం. అవుట్‌పేషంట్ విభాగంలోని రెండో నంబర్ గదిలో రోగులు పేర్లు నమోదు చేయించుకోవాలి. చీటీతో ఓపీ విభాగంలోని 21 నంబర్ గదికి వెళ్లాలి. అక్కడ వైద్య పరీక్షలు చేసి అవసరం ఉన్న వారిని ఇన్‌పేషెంట్ విభాగంలో అడ్మిట్ చేసుకుంటారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజూ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీలో వైద్య సేవలు లభిస్తాయి. ఆడా, మగ తేడా లేకుండా అందరికీ మానసిక సమస్యలు వస్తాయి. మందులతో నయం చేయవచ్చు. వీటితో పాటు కౌన్సిలింగ్ చాలా ముఖ్యం. వ్యాధిగ్రస్తుల్ని కుటుంబ సభ్యుల పర్యవేక్షిస్తూ మందులు సక్రమంగా మింగేలా చేస్తే త్వరితగతిన బయటపడతారు.

– డాక్టర్ నీలి ఉమాజ్యోతి, జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగాధిపతి

ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకోవచ్చు

కొల్లిపర: అభ్యంతరం లేని అనధికారికంగా ఆక్రమించుకొని ఉన్న ప్రభుత్వ భూములను 2023 డిసెంబర్ 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జి.నాంచారయ్య తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఎస్‌ఓ 21, 26కి అనుగుణంగా 2019, అక్టోబర్ 15 నుంచి లేదా అంతకు పూర్వం అభ్యంతరం లేని అనధికారంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని జీవించుచున్న వ్యక్తులకు భూమిని కేటాయించే పథకాన్ని ప్రవేశపెడుతూ 2021లో జీఓ జారీ చేసిందన్నారు. అయితే ఆ ఉత్తర్వులకు కొన్ని సవరణలు చేస్తూ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో జీఓ 60 జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం 100 గజాల వరకు అన్ని అర్హతలు గల దారిద్ర్యరేఖకు దిగువ, ఎగువన ఉన్న అందరికీ ఉచితంగా 'డి' పట్టా మంజూరు చేయబడుతుందని, పది ఏళ్లలోపు భూ బదలాయింపు సంక్రమించే విధంగా , 101 నుంచి 200 చదరపు గజముల వరకు బేసిక్ విలువలో 50శాతం ప్రభుత్వానికి చెలించాలని, 201 నుంచి 300 చదరపు గజముల వరకు బేసిక్ విలువలో 100 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని, 301 నుంచి 500 చదరపు గజము వరకు 150 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందని, 500 చదరపు గజములకు పై బడి ఉంటే ఆక్రమణలు తొలగించబడతాయన్నారు. 101 చదరపు గజముల నుంచి 500 చదరపు గజముల వరకు క్రమబద్ధీకరించుకొనుటకు పైన తెలిపిన విధంగా రుసుము చెల్లించే వారికి కన్వేయన్స్ డీడ్‌ద్వారా సదరు ఆస్తికి హక్కులు బదలాయించబడతాయని పేర్కొన్నారు. అభ్యంతరం లేని అనధికారికంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని మండలంలో వివిధ గ్రామాలల్లో జీవిస్తున్న వారు సదరు గృహమునకు సంబంధించిన విద్యుత్ కనెక్షన్, ఇంటి నిర్మాణ అనుమతి పత్రము, కులాయి పన్ను రసీదు, ఇతర ఆధారంతో గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

నందివెలుగులో సినిమా షూటింగ్ ప్రారంభం



నటులకు సన్నివేశాన్ని వివరిస్తున్న దర్శకుడు సత్య

తెనాలిటౌన్: సాధన ఫిలింస్ పతాకంపై నిర్మిస్తున్న నూతన చిత్రం షూటింగ్ గురువారం కొల్లిపర, నందివెలుగు గ్రామాల్లో జరిగింది. కొత్త నటులతో ఫ్యామిలీ ఓరియంటెడ్ మేసేజ్‌గా సినిమాను నిర్మిస్తున్నామని నిర్మాత గళ్ల నాగేశ్వరరావు తెలిపారు. నందివెలుగు గ్రామంలో చెరువులో నందీశ్వరుని విగ్రహం వద్ద కొన్ని సన్నివేశాలను హీరో, హీరోయిన్ లపై చిత్రీకరించారు. తెనాలి పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్‌ను శరవేగంగా జరుపుతున్నట్లు దర్శకుడు సత్య.పి తెలిపారు. చిత్రంలో రామ్, చంద్రలీనా జంటగా నటించగా సైదావలి, దుర్గ, తోటకూర కోటేశ్వరరావు, స్వర్ణలత, రవి, చందు, సుబ్బయ్య, జగన్, వడ్లమాని శ్రీనివాస్ తదితరులు నటిస్తున్నారు. సంగీతం కె.లక్ష్మణ సాయి, కెమెరా వడ్డీ వెంకట్, కథ గళ్ళ నాగేశ్వరరావు అందిస్తున్నట్లు దర్శకుడు తెలిపారు.

సుద్దపల్లిలో ఈదురు గాలులు, వర్ష బీభత్సం



తాడి చెట్టు పడి తెగిపోయిన విద్యుత్ తీగలు



గ్రామ శివారులో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం



ప్రధాన రహదారికి అడ్డంగా విరిగిపడిన చెట్టు

సుద్దపల్లి(చేబ్రోలు): ఉదయం తీవ్రమైన ఎండ.. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పులతో ఈదురు గాలులతో కూడిన వర్షంతో చేబ్రోలు మండలంలోని సుద్దపల్లి గ్రామానికి తీవ్ర నష్టం జరిగింది. గ్రామంలో బుధవారం రాత్రి వీచిన ఈదురుగాలులు, భారీ వర్షానికి మూడు ఇళ్లు దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారి పక్కన ఉన్న భారీ చెట్లు, తాడి చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోవడంతో పాటు కొన్ని పక్కకు ఒరిగిపోయాయి. చెట్లు విరిగి విద్యుత్ తీగలు మీద పడటంతో తెగిపోయి నష్టం వాటిల్లింది. ఈ సంఘటనతో గ్రామంలో బుధవారం అంధకారం నెలకొంది. మట్టుపల్లి పుల్లయ్య, కొమ్మిశెట్టి సుబ్బారావుకు చెందిన ఇంటి రేకులు ఎగిరిపోయాయి. పసుపులేటి సుందరరావు ఇంటి ప్రహరీ కూలిపోయింది. విద్యుత్ శాఖకు సుమారు రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు ఏఈ సుధీర్‌బాబు తెలిపారు. అదనపు సిబ్బందితో గ్రామంలో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. తీవ్రమైన ఈదురు గాలులు, భారీ వర్షానికి ఇబ్బందులు పడుతున్నప్పటికీ స్థానిక సచివాలయ, రెవెన్యూ సిబ్బంది స్పందించకపోవడంపై గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని ఇతర గ్రామాల్లో గాలులు, వర్ష బీభత్సం లేకుండా ఒక్క సుద్దపల్లిలోనే చోటు చేసుకోవడం విశేషం.

రెజ్లర్ల దీక్షకు సీఐటీయూ సంఘీభావం



సంఘీభావ ప్రదర్శనలో సీఐటీయూ నేతలు

తెనాలి: ఢిల్లీలో గత 25 రోజులుగా రెజ్లర్లు చేస్తున్న దీక్షలకు సీఐటీయూ, తెనాలి డివిజన్ కమిటీ సంఘీభావం తెలియజేస్తూ, గురువారం ఇక్కడి చెంచుపేటలోని రావి అమ్మయ్య చౌదరి చౌరస్తా వద్ద ప్రదర్శన చేశారు. మహిళా రెజ్లర్లపై లైంగిక దాడులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. రెజ్లర్ల సమాఖ్యకు చైర్మన్‌గా ఉండి లైంగికదాడులకు పాల్పడటం దుర్మార్గమని, ఆయనకు గల అన్ని పదవులను రద్దుచేయాలని నినాదాలు చేశారు. దీక్ష చేస్తున్న రెజ్లర్లపై పోలీసులు వేధింపు చర్యలు మానుకోవాలని సీఐటీయూ నాయకుడు కొల్లిపర బాబూ ప్రసాద్ డిమాండ్ చేశారు. సీఐటీయూ తెనాలి డివిజన్ కమిటీ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి, ఎం.సాంబశివరావు, జి.వెంకటసుబ్బయ్య, షేక్ ఆషాబి, షేక్ బాజీ, డి.శ్రీనివాసరావు, ఎన్.రాజ్యలక్ష్మి, ఎస్ఎస్ లలిత, ఎన్.సాంబశివరావు పాల్గొన్నారు.

మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు



మొక్కజొన్నలను లారీకి లోడు చేయిస్తున్న సొసైటీ అధ్యక్షుడు దయానంద్ తదితరులు

పెదకాకాని: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మొక్కజొన్నలు కొనుగోలు చేస్తున్నట్లు ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు శివాబత్తిన దయానంద్ తెలిపారు. పెదకాకాని మండలం అనుమర్లపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా గురువారం 50 టన్నుల మొక్కజొన్నలు కొనుగోలు చేసి తరలించారు. ఈ సందర్భంగా దయానంద్ మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. క్వింటా రూ. 1962 చొప్పున రెండు లారీలు ఎగుమతి చేసినట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య ఆధ్వర్యంలో మార్క్‌ఫెడ్ సహకారంతో కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ కిశోర్‌కుమార్, సభ్యులు చెన్నుపాటి కళ్యాణ్, పల్లెంపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణ మహోత్సవం

తెనాలిటౌన్: నాజరుపేటలోని లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నృసింహస్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపారు. దేవస్థాన కమిటీ చైర్మన్ కె.చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు బహూకరించి కల్యాణంలో పాల్గొన్నారు. పరమశివానంద భారతి స్వామి వారు కల్యాణం జరిపించారు. అనంతరం సుమారు ఐదు వేల మందికి అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారునికి తీవ్రగాయాలు

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం-పెనుమాక రహదారి మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారునికి తీవ్రగాయాలయ్యాయి. సేకరించిన వివరాల మేరకు... యర్రబాలెంకు చెందిన భీమవరపు నాగయ్య గేదెల మేత కోసం తన ద్విచక్రవాహనంపై పెనుమాక వైపు బయలుదేరాడు. మర్రిచెట్టు ఎదుట ఉన్న డొంకరోడ్డు వద్ద పంట పొలానికి వెళ్లేందుకు మలుపు తిరుగుతున్నాడు. ఈ క్రమంలో వెనుక వైపు నుంచి వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో నాగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని వైద్య పరీక్షల నిమిత్తం హుటాహుటీన ఎయిమ్స్‌కు తరలించారు.

51 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: వృద్ధులు, పిల్లలు, గర్భిణులు వేసవిలో తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని డాక్టర్ ఆస్రఫ్‌తజీన్ అన్నారు. మండలకేంద్రంలోని సబ్ సెంటర్‌వద్ద గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 51మందికి రక్త, మూత్ర పరీక్షలు చేసి మందులు అందజేశారు. నలుగురు గర్భిణులకు పరీక్షలు చేసి మందులు అందించారు.ఎంఎల్‌హెచ్‌పీ అమృతరాణి, ఏఎన్ఎం లావణ్య, విజయ్, గోవిందయ్య, డీఈవో విజయ్ కుమార్, సింగరాజు, ఆశాకార్యకర్తలు అంజలి, శైలజ. సుజాత, నిర్మల జ్యోతిలు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

మంగళగిరి: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనూష అన్నారు. గుడ్‌షెఫర్డ్ కాన్వెంట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జి సిస్టర్ లత ఆధ్వర్యంలో గురువారం నగరంలోని దళితవాడ ఎలిమెంటరీ పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దళిత శిబిరం చైల్డ్ ప్రొటెక్షన్ నూతన కమిటీని ఎన్నుకుంది. అధ్యక్షుడిగా కురగంటి ఆదామ్, కార్యదర్శిగా వి బుజ్జిని ఎన్నుకున్నారు. దళితవాడలో బాల్య వివాహాలు జరుగకుండా, బాలలపై లైంగిక వేధింపులు జరగకుండా తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అరుణ, ఆర్‌పీ జ్యోతి, మధులత, బ్లెస్సి, ప్రియాంక, గుడ్‌షెఫర్డ్ ప్రతినిధులు ఎస్ నాగమణి, బి విజయలక్ష్మి, డి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం శివాలయం ఎదుట స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రం వద్ద గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. యర్రబాలెంకు చెందిన పంది పుష్పావతి జ్ఞాపకార్థం ఆమె తనయుడు పుల్లారావు బాటసారులకు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.సాయి, బి.వెంకట్రావు, ఎం.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు, హనుమాన్ చాలీసా పారాయణ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి 1108 లడ్డూలతో విశేష అర్చనలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణ, సుందరకాండ పారాయణ జరిపారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు ఆర్.శ్రీనివాస మూర్తి, కిరణ్, సురేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, సంకీర్తనా బృందం అధ్యక్షురాలు మూర్తి అనూరాధ, సేవా సమితి సెక్రటరీ మూర్తి వెంకటేశ్వరరావు, ఎం.చంద్రశేఖర్, గుడివాడ బాలకృష్ణ, లీలాప్రసాదరావు, వెంకటేష్, బృందం సభ్యులు పద్మావతి, విజయలక్ష్మి, లక్ష్మీసునీత, రామలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

'డి' పట్టాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో అభ్యంతరం లేని, అనధికారకంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని జీవిస్తున్న వారికి డి పట్టాలు ఇవ్వనున్నట్లు తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 100 చదరపు గజాలలోపు స్థలం ఉండి అన్ని అర్హతలు గల దారిద్య్ర రేఖకు దిగువన /ఎగువున ఉన్న అందరికీ ఉచితంగా డి పట్టా మంజూరు చేస్తామని తెలిపారు. 101 నుంచి 200 చదరపు గజాలు ఉన్నవారికి బేసిక్ విలువలో 50 శాతం ప్రభుత్వానికి చెల్లించాలని, 201 నుంచి 300 చదరపు గజాలు ఉన్నవారికి బేసిక్ విలువలో 100 శాతం ప్రభుత్వానికి చెల్లించాలని, 301 నుంచి 500 చదరపు గజాలు ఉన్నవారికి బేసిక్ విలువలో 150శాతం చెల్లించాలని తెలిపారు. 500 చదరపు గజాల వరకు, ఆ పైబడి ఉన్నవారి ఆక్రమణలు తొలగిస్తామని తెలిపారు. 15-10-2019 లేదా అంతకు పూర్వం అభ్యంతరం లేని, అనధికారికంగా ఆక్రమించుకొని ఉన్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకొనదలచిన వారు 31-12-2023లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 101 నుంచి 500 చదరపు గజాల వరకు క్రమబద్ధీకరించుకొనుటకుగాను పైన తెలిపిన విధంగా రుసుము చెల్లించిన వారికి 'కన్వేయన్స్ డీడ్' ద్వారా ఆస్తికి హక్కులు బదలాయిస్తారని తెలిపారు. ఆ గృహమునకు సంబంధించి విద్యుత్ కనెక్షన్, నిర్మాణ అనుమతి పత్రం, కుళాయి పన్ను రశీదు, ఇతర ఆధారాలతో గ్రామ/వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్రీస్తుపై నమ్మకంతో పాపాల నుంచి విముక్తి

గుంటూరు పీఠాధిపతి భాగ్యయ్య



వాక్యోపదేశం చేస్తున్న గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య

పెదనందిపాడు: ప్రతి ఒక్కరూ క్రీస్తును నమ్ముకోవాలని, ఆయనకు ప్రార్థన చేసి పాపాల నుంచి విముక్తి పొందాలని గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య ఉద్బోధించారు. స్థానిక బాల యేసు దేవాలయం నూతనీకరణ గురువారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భాగ్యయ్య వాక్యోపదేశం చేస్తూ యేసుక్రీస్తు పాపుల రక్షణ కోసమే భూలోకం జన్మించి, పాపాల విముక్తి కోసమే శిలువపై మరణించాడని తెలిపారు. యేసు చేసిన ఘనకార్యాల గురించి ప్రజలకు తెలియజేశారు. అనంతరం దివ్య పూజాబలిని సమర్పించారు. కార్యక్రమంలో స్థానిక విచారణ గురువు, వివిధ చర్చిల పాస్టర్లు, సంఘస్తులు పాల్గొన్నారు.

గాయత్రీదేవికి లక్ష మల్లెల పూజ



లక్ష మల్లెల పూజలో గాయత్రీదేవి అమ్మవారు

చేబ్రోలు: కొత్తరెడ్డిపాలెం ఆనందాశ్రమంలోని గాయత్రీదేవి అమ్మవారికి గురువారం లక్ష మల్లెల పూజ నిర్వహించారు. అర్చకుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు, అభిషేకాలు జరిగాయి. మేధా దక్షిణామూర్తికి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకారంలో భీమేశ్వరస్వామి

వసంత రుతువు వైశాఖ మాస శివరాత్రి సందర్భంగా చేబ్రోలులోని భీమేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. వసంత రుతువులో లభ్యమయ్యే పూలు, పండ్లతో పూజలు, అలంకరణను అర్చకులు నిర్వహించారు. మల్లె పూలు, మామిడి ఫలాలతో పూజలు చేశారు. ప్రత్యేక అలంకారంలో భీమేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.